వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తామని, విద్యార్థులు విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. వైవీయూ ప్లేస్‌మెంట్‌సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో గురువారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. డ్రైవ్‌ను విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలకు ప్రత్యేక శిక్షణలు ఇస్తామన్నారు. ఆచార్య పి పద్మ మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు.

భూ పోరాటాలకు సిద్ధం కండి

- సుందరయ్య, అంబేద్కర్ ఆశయ సాధనకు పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బద్వేలు

ఈనెల 15న బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహించబోయే భూ పోరాటాలకు సిద్ధం కావాలని, సుందరయ్య, అంబేద్కర్ ఆశయ సాధనకు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శ్రీను 'భూబాధితులు–వలసల నివారణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి నియోజకవర్గంలోని 15 గ్రామాల్లో బ్రహ్మం గారిమఠం లోని 5 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వారిచే ఎర్రజెండాలు నాటించి భూమి చదును చేస్తారని తెలిపారు. పాలకులు, ఉద్యోగులు పేదల దరఖాస్తులను పరిశీలించి, వారికి డికెటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 74 ఏళ్లుగా ప్రభుత్వాలతో పాలకులతో పోరాడి సాధించుకున్న పేదల అనుకూల ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దుచేసి ఆధునిక భూస్వామ్య వ్యవస్థను సెజ్‌ల పేరుతో తీసుకునేందుకు యత్నిస్తున్నాయని, దీనిని గ్రామీణ నిరుపేదలందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో దళితులు పదుల, వందల సంవత్సరాల నుండి సాగు చేసుకుంటూ అనుభవించుకుంటూ ఫైర్లు పెట్టుకుంటున్నారని, వారికి సాగు పట్టా కానీ, డికెటి పట్టా కానీ ఇవ్వడం లేదని, ఇప్పుడు ఆ భూములన్నీ గ్రామీణ ధనిక పెత్తందారీ వర్గాలు ఆన్‌లైన్‌ల్లో అర్హులుగా పేర్లు చేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అడ్డుకోకపోతే, గ్రామ గ్రామాన "లడాయి" మొదలవుతుందని వారు హెచ్చరించారు. శాంతి భద్రతల సమస్యలు ముందుకు వస్తాయన్నారు. గ్రామీణ యధార్థ, వాస్తవ పరిస్థితులను, బాధలను ప్రభుత్వాలకు అర్థం చేసుకునే సమయం కానీ, చిత్తశుద్ధి కానీ లేదని తెలిపారు. సిపిఎం కార్యకర్తలు నాయకులు గ్రామాల్లో పేద వర్గాల క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో 'పేదల ఐక్యవేదిక' లు ఏర్పాటు చేసి 'సామాజిక న్యాయం కోసం' పోరాటాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ బలహీన శక్తులన్నీ ఐక్యమై బలమైన శక్తులుగా ఎదగాలన్నారు. గ్రామీణ పేద వర్గాల యువతను పెత్తం దారులు బుజ్జగించి, జో కొడుతున్నారని, గ్రామీణ పెత్తందారుల నక్కజిత్తుల మోసాలను గ్రామీణ యువత తిప్పి కొట్టాలన్నారు. ఎన్నికల విజయాల్లో వామ పక్షాల పాత్ర కీలకమైనదని ప్రభుత్వాలు, పాలకులు గుర్తుపెట్టుకోవాలని అధికారంలో ఉన్నప్పుడు పేదలను నిర్లక్ష్యం చేస్తే, వైసిపికి పట్టిన గతే టిడిపికి పడుతుందని హెచ్చరించారు. లాబీయింగ్, రాజకీయ విరాళాలు ప్రభుత్వాల విధానాలను ప్రభావితం చేస్తున్నా యని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమన్నారు. పేదల గుడిసెల జోలికి వస్తే ప్రభుత్వాలపై ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారన్నారు. పేదలపై కపట ప్రేమను చూపిస్తున్న పాలక ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులను గ్రామ గ్రామాన 'మాకు భూమి కావాలని' ప్రశ్నించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్ బాషా, బద్వేల్ రూరల్, అట్లూరు, బ్రహ్మంగారిమఠం కార్యదర్శులు జి.వెంకటేష్, ఈ.రమణయ్య, జి.సునీల్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్.వీరయ్య, ఎస్ గురయ్యా, నరసింహులు, ఆర్ ఓబయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, బద్వేల్ నియోజకవర్గం లోని ఏడు మండలాల భూపాధితులు, వలస కార్మికులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

సదస్సు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

ఎంఎస్ఎంఇల సాధికారతతోనే ఆర్థిక పరిపుష్టి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

సంఘ సభ్యులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) సాధికారతతోనే దేశ సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం నగర శివారులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో యూనియన్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన 'మెగా ఎంఎస్ఎంఇ ఔట్ రీచ్ క్యాంపు' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు యూనియన్ బ్యాంకు కడప రీజినల్ మేనేజర్ లక్ష్మీ తులసి, ఎంఎస్ఎంఇ జి.ఎం. జి.కె. సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప యూనియన్ బ్యాంకు సంస్థ ఎంఎస్ఎంఇల కోసం ప్రత్యేక ఔట్ రీచ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో పారిశ్రామిక రంగం వైపు అవగాహన పెంచడం అభినందనీయం అన్నారు. ఇప్పటి వరకు ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏ బ్యాంకు కూడా నిర్వహించలేదని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. మన రాష్ట్ర పెట్టుబడి మూలాలన్నీ యూనియన్ బ్యాంకులో నిక్షిప్తమై ఉన్నాయని ఈ సంస్థ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల నుండి కోట్లాది రూపాయల పెట్టుబడి లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలో 10 లక్షల నుండి 120 కోట్ల పెట్టుబడితో నిర్వహించే ప్రతి పరిశ్రమను సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల కింద చేర్చారని పేర్కొన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఇ విభాగాన్ని ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి 'ఉద్యం' పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరూ ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వం నుండి అందే అన్ని రకాల రాయితీలను పొందాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే జిల్లా యంత్రంగా కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు కడప రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 48 బ్రాంచులతో యూనియన్ బ్యాంకు బ్యాంకింగ్ విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. చేనేత సంఘాలకు ముద్ర లోన్లు, అలాగే బిసి వర్గాలకు పిఎం విశ్వకర్మ రుణాలను విస్తృతంగా అందిస్తున్న సంస్థ యూనియన్ బ్యాంకు అన్నారు. జిల్లాలో 551 మందికి 150 కోట్లకు పైగా నారీశక్తి పథకం ద్వారా రుణాలను అందించారని పేర్కొన్నారు. కడప రీజియన్ పరిధిలో ప్రస్తుతం రూ. 600 కోట్లతో ఎంఎస్ఎంఇలకు రుణాలను అందివ్వడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో 400 మంది ఎస్‌హెచ్‌జి. గ్రూపులకు మంజూరైన రూ.21 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 200 గ్రూపులకు చెందిన రూ.12 కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కులను, మహిళా సంఘ సభ్యులకు, చేనేత సంఘాలకు, బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ. 6.12 కోట్లను లబ్ధిదారులకు కూడా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ మెప్మా, ఐసిడిఎస్ పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, శ్రీలక్ష్మి హ్యాండ్ లూమ్స్ ఏడీ పిచ్చేసేశ్వర రావు, బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ, యూబిఐ అన్ని శాఖల బిఎంలు, బ్యాంకు ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంప్రోక్షణ కార్యక్రమంలో వేద పండితులు

శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

రెండో అయోధ్యగా పేరుగాంచిన శ్రీ కోదండరామాలయంలో శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైదిక మహోత్సవాల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం ప్రధానంగా కలశ జల కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఉదయం ఏడున్నర గంటలకు వేదమంత్రోక్షణ యాగ పురోహితులు వేద పండితులు మంగళ వాయిద్యాలతో కోలాటం, కోలాహల భజనలతో సంప్రదాయ నడకల మధ్య ఆలయ బావి దగ్గరికి చేరుకుద.ఇ అనంతరం శాస్త్ర యుక్తంగా వేద మంత్రాలతో కుంభాలకు పవిత్ర జలాన్ని తీసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ జలాన్ని మంగళకరంగా ఆలయానికి తీసుకొచ్చారు. కలశ జలాన్ని ఆలయంలోనికి తీసుకువచ్చి యాగశాలకు తీసుకొని వచ్చి యాగ శాలలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టిటిడి సిబ్బంది, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

'వాఘా', 'ఝాన్సీ' జాగిలాలు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-కడప అర్బన్

పోలీసు జాగిలాలను సన్మానిస్తున్న ఎఎస్‌పిలు

పోలీస్ జాగిలాలు 'వాఘా', 'ఝాన్సీ' 11 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించి, పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని ఎఎస్‌పి కె. ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం స్థానిక పెన్నార్ పోలీస్ హాలులో 'వాఘా', 'ఝాన్సీ' ఉద్యోగ విరమణను ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరులుగా పేరు గాంచిన లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన జాగిలాలు 'వాఘా', 'ఝాన్సీ'లను ఎఎస్‌పిలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ కాలంపాటు సంపూర్ణ ఆరోగ్యంతో, చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్‌లు డి.పీరయ్య, బి.వి కృష్ణయ్యను ప్రత్యేకంగా శాలువా కప్పి అభినందించారు. పది సంవత్సరాల పాటు జాగిలాల బాగోగులు చూసుకునే నేపథ్యంలో వాటితో ఏర్పడ్డ అనుబంధాన్ని మున్ముందు కూడా కొనసాగించి జాగ్రత్తగా చూసుకోవాలని ఆకాంక్షించారు. పలు సి.ఎం బందోబస్తు విధులు, వివిఐపి, విఐపిల విధులు, కృష్ణా, గోదావరి పుష్కరాలలో, తిరుమల బ్రహ్మోత్స వాలలో సమర్థంగా విధులు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. అసెంబ్లీ బందోబస్తు విధులు, స్వాతంత్ర్య, రిపబ్లిక్ వేడుకల సందర్భంగా పెరేడ్‌లలో ప్రదర్శన చేసి ప్రతిభ కనబరి చాయమన్నారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో బందోబస్తు విధుల్లో, కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాయని చెప్పారు. వాఘా 2013 డిసెంబర్ 1న, ఝాన్సీ 2014 సెప్టెంబర్ 9న జన్మించాయని పేర్కొన్నారు. ఏడాది పాటు శిక్షణ పొందిన అనంతరం జిల్లా పోలీస్ శాఖలో సేవలను ప్రారంభించాయన్నారు. చివరిగా 'వాఘా', 'ఝాన్సీ'లను మేళాతాళాలతో, బాణా సంచా కాల్చుతూ వాటి విడిది గృహాల వద్దకు చేర్చి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎఆర్‌డిఎస్‌పి కె.శ్రీనివాస రావు, ఆర్‌ఐలు శివరాముడు, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్‌ఎస్‌ఐలు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ టీం, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విరమణ వయసు పెంచాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మండల వనరుల కేంద్రంలో పనిచేస్తున్న ఎంఆర్‌సి సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలను జెఎసి నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల వనరుల కేంద్రం ఎదుట నిర సన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలునుఅసెంబ్లీలో ప్రకటన చేయాలని కోరారు. మినిమం టైం స్కే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరారు.

మహిళా సంఘాలతో ముఖాముఖి

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె : స్థానిక వెలుగు కార్యాలయంలో పోస్టల్ శాఖలో అందిస్తున్న సేవలు, పథకాలపై మహిళా సంఘ సభ్యులతో ముఖాముఖి గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సచిన్ మిట్టల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ పోస్టల్ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలు సుకన్య సంవృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, ఇన్సూరెన్స్, వంటి పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.ఆనంద్ నాయక్ మాట్లాడుతూ సంఘ మహిళలు చేస్తున్న జీవనోపాధుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగం పోస్ట్ ఆఫీస్‌లో పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ ఐ.బి. నీలకంఠరెడ్డి, వెంకట రమణ రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరేళ్లు పూర్తయిన వారిని నియమించాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా, సూపరింటెండెంట్లుగా అతి తక్కువ సర్వీస్ ఉన్న వారిని నియమి స్తున్నారని, కనీసం ఆరు సంవత్సరాలు పూర్తి చేసిన వారిని నియమించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. గురువారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివార్జున మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల సహాయకులను 10వ తరగతికి ఇన్విజిలేటర్లుగా నియమించాలని ప్రభుత్వం భావిస్తుందని, కనీసం ఆరేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారిని నియమించాలని పేర్కొన్నారు. సీనియారిటీ లిస్టులోని అభ్యంతరాలను స్వీకరించే గడువు తేదీని పొడిగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. సుదర్శన్ బాబు, ఎం.గంగరాజు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కృత్రిమ కాలును అందజేస్తున్న ఏడీ

ప్రమాదవశాత్తు కాళ్లు విరిగిన వారికి కృత్రిమ కాళ్ల పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారిక సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ కృష్ణకిషోర్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణలో చెన్నైకి చెందిన ఫ్రీడమ్ ట్రస్ట్ ద్వారా యాక్స్ హెల్త్ కేర్ సహకారంతో కృత్రిమ కాళ్ల పంపిణీకి అవసరమైన కొలతలను వికలాంగుల నుంచి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చెన్నై నుంచి ఫ్రీడమ్ ట్రస్ట్ వారు అవసరమైన వారికి కొలతలు తీసుకున్నారని తెలిపారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అవసరమైన వారు వచ్చి కొలతలు ఇవ్వాలని కోరారు. ఒక్కొక్క కృత్రిమ కాలు విలువ రూ.50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. వీరు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి సుదర్శన్ రెడ్డి, వారి సిబ్బంది, దర్శనీ మానసిక పాఠశాల నిర్వాహకులు గోవిందరెడ్డి, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 878 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇంటర్ వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం మొదటి సంవత్సరం మాథ్స్-1ఎ, బాటని, సివిక్స్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 17,655 మంది హాజరు కావాల్సి ఉండగా 16,906 మంది హాజ రయ్యారు. 749 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్స్ సంబంధించి 1,525 మంది హాజరు కావాల్సి ఉండగా 1,396 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 19,180 మంది హాజరు కావాల్సి ఉండగా 18,302 మంది హాజర య్యారు. 878 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి డి బార్లు నమోదు కాలేదు.

10న పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి -కడప అర్బన్

పెన్షన్ అదాలత్ ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు రీజనల్ పిఎఫ్ కమిషనర్-2 గౌరవ్ మహల్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వైవీయూ విసి ప్రకాశ్‌బాబు బదిలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ విసిగా ఫిబ్రవరి 24న బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ బాబు బదిలీ అయ్యారు. విసి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరి సెంట్రల్ వర్సిటీ విసిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఐదేళ్లు పుదుచ్చేరి విసిగా ప్రకాష్ బాబు కొనసాగుతారు. ఇటీవల విసిల నియామకంలో భాగంగా ఆయన వైవీయూకు వచ్చారు. ఎంతో ప్రతిభ పాఠవాలు ఉన్న విసి పట్టుమని పది రోజుల్లో బదిలీ కావడంపై వైవీయూ వర్గాలు విస్మయం చెందాయి.

అత్యున్నత స్థాయికి ఎదగాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి దశలో కష్టపడి చదివి ఎంచుకున్న రంగంలో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఆకాంక్షించారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో మహిళా సాధికారత వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఒపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల విద్యార్థులు చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదివి తల్లిదండ్రులకు, చదివిన విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేరదర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఒపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒపెన్ హౌస్‌లో భాగంగా బాంబుడిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్, ఆయుధాల విడి భాగాల సమాచారం గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి కె. శ్రీనివాసరావు, ఆర్ఐ ఆనంద్, నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. **వల్లూరు :** రోజూ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే విధివిధానాలపై విద్యార్థులకు గురువారం వల్లూరు పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాల వారోత్సవాలలో భాగంగా వల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఒపెన్ హౌస్‌ను నిర్వహించారు. విద్యార్థులకు సెట్ కాన్ఫరెన్స్, ఖైదీ గది, ఆయుధాలను చూపించి పోలీస్ విధానాలపై అవగాహన కల్పించారు. పోక్సో, బాలికల హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రమాదం ఎప్పుడు జరిగినా 100కు కాల్ చేసి వెంటనే సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు

జాతీయ స్థాయికి 'శ్రీనలంద' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీ నలంద పాఠశాల నుంచి ఐఐటి, జెఇఇ, నీట్ ఫలితాలలో జాతీయస్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అనుగుణంగా 9 సంవత్సరాల నుంచి పాఠశాల స్థాయి నుంచి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులు కూడా సాధించారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఆల్ ఇండియా మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ వారు ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహించే పోటీలలో శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు 8వ తరగతికి చెందిన ఎస్. తేజశ్రీ జోన్ స్థాయి 8వ ర్యాంకు సాధించగా,5వ తరగతికి చెందిన పి. ప్రవీణ స్టేట్ 3వ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయాలు పాఠశాల ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం వల్లే సాధ్యమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివ, వైశాలి, లక్ష్మీనారా యణమ్మ, ప్రమీల, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్ : అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించిన ఏడుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న రేనాటి శివనాగిరెడ్డి, డి.జగదీశ్వర రెడ్డి, డి.అనిల్ కుమార్, జి.ప్రణయ్ కుమార్ రెడ్డి, జి.సూర్యనారాయణ రెడ్డి, ఎం.నాగ కీర్తన, ఎం.సుబహాన్‌కు అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, అంకిత భావం, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలకు అత్యుత్తమ పోలీస్ సేవలు అందించి, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంపొందేలా ఉండాలని సూచించారు. ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో బేసిక్ పోలీసింగ్ విధానం గురించి పూర్తి స్థాయిలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నేరస్థులు శిక్షింపబడే విధంగా కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు.

రిజర్వులో ఉంచిన పోసాని బెయిల్, కస్టడీ తీర్పు

ప్రజాశక్తి - కడప : పోసాని కృష్ణమురళీ బెయిల్ పిటిషన్, పోలీసుకస్టడీపై గురువారం కడపలోని స్పెషల్ మొబైల్ కోర్టులో విచారణ జరిగింది. బెయిల్ పిటిషన్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై ఇరు పక్షాలు తమ వాదనలను జడ్జికి వినిపించారు. ఇరు పక్షాల వాదనలు పూర్తయిన తర్వాత మేజిస్ట్రేట్ తీర్పును రిజర్వ్‌లో ఉంచినట్లు సమాచారం.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

ప్రజాశక్తి - కడప

ఆకాంక్ష జిల్లాల ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ బోర్డు రూమ్ హాలు నుంచి 'ఆకాంక్ష జిల్లాల ఆశయసాధన కార్యాచరణ ప్రగతి'పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ డాక్టర్ సచిన్ మిట్టల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ 'నీతీ ఆయోగ్' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. అందులో వైఎస్ఆర్ జిల్లా, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేశారన్నారు. ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న ప్రగతిపై పి పి టి ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డా.సచిన్ మిట్టల్ కు వివరించారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

చీపాటు మోషే (ఫైల్‌ఫొటో)

మైలవరం మండలం దుగ్గనపల్లి గ్రామానికి చెందిన చీపాటు మోషే (50) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. మృతుడు ఆరు ఎకరాల పొలంలో మిరప పంటను సాగు చేశారు. ఎకరాకు రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షలు ఖర్చు చేశారు. గతంలో కూడా వివిధ పంటలు వేయడం నష్టం వచ్చింది. మొత్తం రూ. 40 నుంచి రూ. 50 లక్షల వరకు అప్పు ఉన్నట్లు సమాచారం. ఒకవైపు పంట దిగుబడి సరిగ్గా రాక పోవడం, మరో వైపు అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో దిక్కు తోచని స్థితిలో గురువారం తన పొలం వద్ద పురుగుల మందు తాగు మృతి చెందాడు. మృతిని భార్య గతంలో కిడ్నీ సమస్యతో చనిపోయారు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. మేషే చనిపోవడానికి దాల్మియా పరిశ్రమ నుంచి వెలువడే దుమ్మూధూళే కారణమని కుటుంబ సభ్యులు బంధువులు ఆరోపిస్తున్నారు. దుగ్గన పల్లి గ్రామానికి పక్కనే దాల్మియా పరిశ్రమ ఉండడం వల్ల అందులో నుంచి వెలువడే దుమ్ము దూళి పంట పొలాలపై పడి పంట సక్రమంగా రాలేదన్నారు. ఈ ఏడాది మిరప పంటపై అధికంగా దుమ్ము ధూళి పడటం, మిరపకు ధర లేకపోవడం, మిరపను గుంటూరుకు తీసుకువెళ్లడంతో వారు మిరప బాగలేదని కొనుగోలు చేయకపోవడంతో మృతుడు తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మోషే కుటుంబానికి దాల్మియా పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు మృతుడి తండ్రి స్వామి దాసు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్‌టిపిపి కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మృతిచెందిన నాగరాజు

మండలంలోని ఆర్‌టిపిపిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. తాడిపత్రికి చెందిన నాగరాజు (40) ఆర్‌టిపిపి కోల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా మెకానిక్ విధులు నిర్వహించేవాడు. అ విధి నిర్వహణలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి గుండెపోటుకు గురయ్యాడని తోటి కార్మికులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, మిత్రులు ఆర్‌టిపిపి వద్దకు పెద్ద ఎత్తున వచ్చి విధి నిర్వహణలో ఉండగా యాజమాన్య నిర్లక్ష్యంతో నాగరాజు మృతిచెందాడని ఆరోపించాచు. మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించి, కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం పనిచేయండి

ప్రజాశక్తి-కాశినాయన : కూలీలు నిబంధనల ప్రకారం పనిచేస్తే దాని తగ్గట్టు కూలి వస్తు ందని ఉపాధి హామీ చట్టం టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన నరసాపురంలో నిర్వహించే ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఎండాకాలం కనుక ఉదయం 6 గంటలకు పనికి వచ్చి కనీసం 11 గంటల వరకైనా పనిలో ఉండాలని పేర్కొన్నారు. పని తగ్గట్టుగా కొలతలు కూడా ఉంటాయని, కొలతల ప్రకారం పని చేయకపోతే కూలి తక్కువ పడుతుందని చెప్పారు. ఆయన వెంట సీనియర్ మేట్ మహబూబాషా ఉన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని బహిష్కరించండి : కాంగ్రెస్

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం- 2024 వాస్తవంగా ఆస్తుల భక్షణ చట్టం అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం. రహమతుల్లాఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలోని స్థానిక రెండో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు గురువారం ఈ చట్టానికి వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతవిద్వేష పాలకుడు ప్రధాని నరేంద్ర మోడీ 1995 వక్ఫ్ చట్టాన్ని రద్దుచేసి ఏకపక్షంగా కొత్త చట్టాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వాస్తవంగా ఈ చట్టం దేశంలోని లక్షలాది కోట్ల రూపాయల సంపద కలిగిన వక్ఫ్ ఆస్తులను భారతీయ జనతా పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి కాజేసేందుకు కుట్ర పన్నినట్లు విమర్శించారు. పాత వక్ఫ్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ చట్టాన్ని ముకుమ్మడిగా బహిష్కరించాలని మరోసారి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైసరికి నిరసనగా వివిధ స్థాయిల్లో ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రధానంగా రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయని వారు తెలిపారు. అనంతరం పార్టీ కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సిరాజుద్దీన్, మహిళా నేతలు శ్యామలమ్మ, సంజయ్ కాంత , కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు దినకర్ రెడ్డి, హమీద్, కమల్ బాషా, జహీర్ పాల్గొన్నారు.

సాగులో ఉన్న వేరుశనగ పంట

వేరుశనగ పంటపై రైతుల్లో ఆశలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రబీలో సాగు చేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ పంట సాగుకు పెట్టుబడి ఎక్కువవుతుంది. ఈ నేపథ్యంలో పంటసాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. వేరుశనగ పంట సాగు దశ నుంచి విడతల వారీగా ఎకరాకు సుమారు రూ.35 వేల నుంచి రూ.37 వేల వరకు పెట్టుబడి వస్తుంది. దుక్కులు దున్నడానికి రూ.2,600, అదును పిండికి రూ.2,500, క్వింటాల్ విత్తనాలకు రూ.10,500, విత్తనాలు వేయడానికి రూ.1,200, గులికలకు రూ.400, రెండు సార్లు (స్ప్రే) చేయడానికి రూ.5 వేలు, కలుపు రెండు సార్లకు రూ.5 వేలు, చేను తీయడానికి, మిషన్‌కు, ఇతర ఖర్చులు కలిపి తడిసిమోపెడవుతోంది. సాధారణ దిగుబడి వస్తే అన్నిపోను రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు లాభం వస్తుంది. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తే క్వింటా రూ.7000 లెక్కన రూ.70,000 వేల వరకు వస్తుంది. పెట్టుబడి రూ.35 వేలు పోను రూ.35 వేల వరకు రైతుకు మిగులుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కిట్లు అందజేస్తున్న దాత శ్రీనివాసులరెడ్డి

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 169 మంది విద్యార్థులకు స్టార్ రైజ్ ఫైనాన్స్ అండ్ షేర్స్ వ్యవస్థాపకులు శ్రీనివాసులరెడ్డి గురువారం పరీక్ష సామగ్రి (ఎగ్జామ్ కిట్లు)ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎగ్జామ్స్ బాగా రాసి స్కూల్కు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేవాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అత్యధిక మార్కులు తెచ్చుకుని స్కూలుకు గుర్తింపు తేవాలన్నారు. కిట్లు దానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుభాస్కర్‌రెడ్డి, చంద్రబాబురెడ్డి, నాగార్జునయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా క్రెడిట్ సొసైటీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగడానికి బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తోందని సొసైటీ సిఇఒ, నాగసాయి తెలిపినట్లు కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రసాదరావు పేర్కొన్నారు. విజయవాడ సొసైటీ ప్రధాన కార్యాలయంలో వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు ప్రసాదరావు తెలిపారు. రాష్ట్రంలో సొసైటీ మెంబర్ షిప్ ఉన్న బ్రాహ్మణులకు రూ.5 కోట్ల మేర వ్యక్తిగత స్వయం ఉపాధి రుణాలు ఇవ్వడానికి క్రెడిట్ సొసైటీ సిద్ధంగా ఉందని సిఇఒ తెలిపారన్నారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ఒక నిర్దిష్ట పద్ధతిలో పని చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 70వేల మందితో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ బలంగా ఉందని, బ్రాహ్మణులు ఆర్థికంగా బలపడడానికి అనేక పథకాలు రూపొందించినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో క్రెడిట్ సొసైటీ సభ్యత్వం తీసుకునే అవకాశం ఉందని ప్రసాదరావు వివరించారు.

సతీష్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న వైసిపి నాయకులు

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాసమస్యలపై పోరాడాలని వైసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో వైసిపి నేతల మధ్య సతీష్‌రెడ్డి గరువారం తన పుట్టినరోజు వేడుకలను చేసుకున్నారు. స్థానిక సతీష్‌రెడ్డి స్వగృహంలో మాజీ ఉప సర్పంచ్ మునీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. సంబరాల్లో వందలాది మంది వైసిపి నేతలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని సతీష్‌రెడ్డి కోరారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మనందరం సమిష్టిగా కృషి చేస్తేనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ మునీర్, ఆర్ఎంఎస్ మున్నా, మండల ఉపాధ్యక్షులు మునీర్ బాషా, వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, హేమాద్రి రెడ్డి, బంక సోమేశ్వర్ రెడ్డి, రామగంగిరెడ్డి, మాజీ ఎంపిపి గోగుల కొండయ్య, బిఎస్ షేక్షావలి, పద్మా రాజ్‌కుమార్, ఘతాల శ్రీను, ప్రసాద్, మాజీ దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, భారతి, చంద్రశేఖర్, హబీబ్, అభిమానులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-II ADDITIONAL DISTRICT JUDGE, KADAPA AT PRODDATUR

M.V.O.P. No. 140 / 2022

Bommala@ Bommara Divya, D/o B. Anjaneyulu, aged about 2 years, Hindu, Minor, (Aadhaar No.2658 5714 3201), represented by her mother natural guardian Bommala Adi Lakshmi, W/o B. Anjaneyulu, aged about 28 years, Hindu, Coolie, (Aadhaar No. 9880 7625 3038), resident of D.No. 17-72-A Up Stairs, Penna Nagar, Somulavaripalli Panchayat, Proddatur Mandal, Kadapa District.

...Claimant

Vs

1. Shaik Ghouse Peer @ Shaik Ghouse, S/o Gaibu Sab, aged 30 years, Muslim, Driver of the 1st respondent's Car bearing No.AP-39-GP-7467, resident of D.No.24/105-1, Powerhouse road, Proddatur town and Mandal, Kadapa District.

...Respondent No.3

The claimant filed the petition in the above matter against you, if you have got any objection you may appear before this Hon'ble Tribunal at 10.30 A.M, on or before 27-03-2025, either in person or through an Advocate and file your objection, if you failed to do so, the matter will be decided exparte.

E.V. SUDHAKAR REDDY,
S. NOORULLAH,
Advocates, Proddatur,
Kadapa District.

కుక్కల దాడిలో జింక మృతి

పులివెందుల టౌన్ :కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన చోటు చేసు కుంది. బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని ఉలిమెల పొలాల్లో జింక కుక్కల దాడిలో మృతి చెందిందని ఫారెస్ట్ అధికారులు తెలి పారు. గ్రామస్తుల సమా చారం మేరకు గురువారం ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి జింకను పోస్టు మార్టం నిమిత్తం పులివెందుల పశువైద్యశాలకు తరలించారు. జింక కడుపుతో ఉన్నందున పరిగెత్తడానికి వీలు లేకపోవడంతో కుక్కలు గొంతు కొరకడంతో అధిక రక్తస్రావం జరిగి జింక మరణించినట్లు అధికారులు తెలిపారు.

అస్తవ్యస్తం.. వాటర్ గ్రిడ్ పైపులైన్ పనులు

ఆర్అండ్‌బి రోడ్డుకు పక్కనే ఏర్పాటు, ఐదు మీటర్లు దూరాన ఏర్పాటు చేయాలని సూచించినా పట్టని వైనం

సిద్ధంగా ఉన్న పైపులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో వాటర్‌గ్రిడ్ పైపులైన్ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. వెలిదండ్ల నుంచి సింహాద్రిపురం వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రోడ్డుకి ఇరువైపులా పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పైపులైను నిబంధనలకు విరుద్ధంగా ఆర్అండ్‌బి రోడ్డుకు రెండు మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేయడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 299 గ్రామాలకు, పులివెందులలోని జేఎన్టీయూ, ఆంధ్రప్రదేశ్ అత్యున్నత పశు పరిశోధన కేంద్రం, వేంపల్లి సమీపంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటికి సురక్షిత నీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం దాదాపు రూ.460 కోట్లతో పనులను చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో డబల్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.28 కోట్లతో ప్రతిపాదనలు సైతం ఆర్అండ్‌బి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. త్వరలోనే రోడ్డు పనులను చేపట్టే అవకాశం ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబు తున్నారు. డబల్ రోడ్డు నిర్మాణాలు చేపట్టితే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్‌ను మళ్లీ మార్చాల్సి ఉంటుందని ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారు.

మూడుసార్లు పనులు నిలిపివేశా..

వాటర్ గ్రిడ్ నిర్మాణ పనుల్లో భాగంగా పైపులైన్ ఆర్అండ్‌బి రోడ్డుకు దగ్గరగా వేస్తున్నట్లు తెలియడంతో మూడు సార్లు పనులు నిలిపేశాం. విషయాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులకు తెలిపాం. రోడ్డుకు అయిదు మీటర్ల దూరంలో లేకపోతే తొలగిస్తాం.

- మహమ్మద్ యూసఫ్, ఎఇ, ఆర్అండ్‌బి, సింహాద్రిపురం

నిబంధలనకు విరుద్ధంగా చేస్తున్న పైప్‌లైన్ పనులు

నమ్మకం, నిజాయితీ వ్యాపారాభివృద్ధికి పెట్టుబడి

- అభివృద్ధిలో ఆదర్శనీయులు సుబ్బారావు దంపతులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సుబ్బారావు, లావణ్య

సర్వేజనా సుఖినోభవంతు అను దీవెనానుసారం వ్యాపారంలోనే కాదు.. ప్రతి ఒక్కరి జీవితాల్లోనూ సువాసన వెదజల్లాలనే సదుద్దేశంతో స్వయం ఉపాధి పథకం ద్వారా అగరబత్తుల వ్యాపారం మొదలు పెట్టామని ప్రొద్దుటూరుకు చెందిన దంపతులు సుబ్బారావు, లావణ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 సంవత్సరానికి సంబంధించి రూ.కోటికి పైబడి స్వయం పాధి పథకం ద్వారా లావాదేవీలు జరిపే సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రదానం చేయాలని నిర్ణయించింది. ప్రొద్దుటూరు మెప్మా ద్వారా వీరి వ్యాపార సంస్థ హిమగిరి అగరబత్తుల తయారీ కేంద్రాన్ని అధికారులు గుర్తించి, ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో సుబ్బారావు దంపతులు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. తనకు బాల్యం నుండి భక్తి భావం ఎక్కువన్నారు. అగరబత్తుల వ్యాపారం చేయాలని 2005లో శిక్షణ నిమిత్తం బెంగళూరు వెళ్లానని తెలిపారు. తొలుత ముడి సరుకు లభ్యత, తయారీ విధానం, మార్కెటింగ్ కష్టంతో కూడుకునేదిగా ఉండేదన్నారు. ఇలాంటి వ్యాపారాన్ని ఎందుకు ఎంచుకున్నారని నిరాశ పరిచిన వాళ్లు చాలామంది ఉన్నారన్నారు. వీరు చెప్పినట్టుగానే తొలుత కష్టాలు, నష్టాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. అయినా పట్టు సడలించకుండా సువాసనల వ్యాపారంలోనే సుసంపన్నం కావాలని 2005 నుండి 2011 వరకు గుత్తి, ప్రొద్దుటూరులో వ్యాపారాన్ని మొదలు పెట్టామన్నారు. అగరబత్తులను చేతితో తయారు చేసి అమ్మేవారిమని తెలిపారు. కొంతకాలానికి గుత్తి యూనిట్‌ను మూసివేసి ప్రొద్దుటూరు యూనిట్‌పైన దృష్టి పెట్టి అభివృద్ధి చేశామన్నారు. ప్రాథమికంగా ఈ వ్యాపారం రూ.5లక్షలతో మొదలై నేడు సంవత్సరానికి రూ.కోటికి చేరుకుందన్నారు. ప్రస్తుతం తామిద్దరమే కాక అదనంగా 6 మంది సభ్యులు ఈ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో హిమగిరి అగరబత్తులు విక్రయిస్తున్నామన్నారు. తొలుత సుబ్బారావు ప్రతి ఊరు తిరిగి తెలిసిన వారి ఫోన్ నెంబర్ల ద్వారా సమాచారం సేకరించి వ్యాపారాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం కేవలం ఆర్డర్లపైనే వ్యాపారం కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో అధికారుల చేయూతతో వ్యాపారాన్ని అభివృద్ధి చేశామన్నారు. చేసే పనిపై నమ్మకం, పనిలో నిబద్ధత, నిజాయితీ వ్యాపారాభివృద్ధికి మూలమని సుబ్బారావు దంపతులు నిరూపించారు.

అగర్ బత్తీల తయారీలో కూలీలు

తలనీలాల వేలంలో రూ.66 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో భక్తుల తలనీలాల వేలం ద్వారా రూ.66 లక్షలు ఆదాయం వచ్చిందని దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం తలనీలాల బహిరంగ వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య సమక్షంలో నిర్వహించారు. వేలంపాటలో హెచ్చుదారుడుగా ఆదినారాయణ రూ.66 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కేసరిస్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, గండి దేవస్థాన మాజీ చైర్మన్ వెంకటస్వామి, చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఆర్కేవ్యాలీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అల్లాడుపల్లెలో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం శాశ్వత హుండీలను గురువారం లెక్కింపు చేపట్టారు. దేవాదాయ శాఖ ఎసి మల్లికార్జున, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ ఇఒ శ్రీనివాసులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గత నవంబర్ 8న ఉండి లెక్కింపు చేపట్టారని, ప్రస్తుతం హుండీ లెక్కింపు నిర్వహించామన్నారు. రూ.9,25,769 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణ యాదవ్ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. ఉత్సవం ఘనంగా నిర్వహణకు తమ వంతు కృషి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, మాజీ జెడ్పిటిసి మేకల బాబు, టిడిపి నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, కిషోర్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు సిబ్బంది, శ్రీనివాస సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

- మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో ఉండి లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ సమక్షంలో ఆలయ ఇఒ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్ హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ ఆదాయం రూ.58,717 వచ్చినట్లు ఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 7 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇంటెల్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ ఇసిఇ చదువుతున్న 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. ప్లేస్మెంట్ ఇంటర్వ్యూలో విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందర్, ఇసిఇ బ్రాంచ్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, మదన్ కుమార్ పాల్గొన్నారు.

8న ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వేంపల్లి రోడ్డులోని సాయికృప ప్రథమ చికిత్సాలయంలో ఈనెల 8న ఉదయం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపి వైద్యులు ఉల్లికల్ల నారాయణ తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల, పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నాగ రవీంద్ర, జనరల్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టరు టి.శ్రీకాంత్ పరీక్షలు చేస్తారన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఆస్మా, గ్యాస్ ట్రబుల్, జనరల్ చెకప్ పిల్లలు, పెద్దలకు చేస్తారని తెలిపారు. వ్యాధి నిరోధక మందులను ఉచితంగా ఇస్తామని తెలిపారు. ముందుగా పేరు నమోదు చేసుకోవాలంటే 96182 66489 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

వేంపల్లి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకుడ్ని శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకుడు ఇలాంటి వాటికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమ న్యాయమైన కోరికలను తీర్చాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని పశువైద్య విద్యార్థులు కోరారు. తమకు స్టయిఫండ్ పెంచే విషయంలో 32రోజులుగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. గోపవరం పంచాయతీలోని పశువైద్య కళాశాలలో గురువారం 32వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్టయిఫండ్ పెంచే దీక్షలు విరమించేది లేదని తేల్చి చెప్పారు.

పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో పారిశుధ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి గండికోట రాజ్యలక్ష్మి తెలిపారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం లక్ష్మీపేటలోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని ప్రతి ఇంటి నుండి ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలన్నారు. ఇందులో భాగంగా సోమవారం నుండి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రభుత్వం వారు చెత్త సేకరణ విషయంలో పలు ప్రశ్నల మీద సమాచారం సేకరిస్తారని తెలిపారు. కావున ప్రతిరోజు చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు సేకరణ చేపడు తున్నారా, తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా అందచేస్తున్నారా అనే విషయాల్లో సమాచారం సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, రిసోర్స్ పర్సన్ దేవేంద్ర రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్మికుల సంక్షేమానికి చేయూతనివ్వాలని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ కోరారు. విజయవాడలో ప్రొద్దుటూరు శాసనసభ్యులు వరదరాజులరెడ్డిని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు బివోసి డబ్ల్యూ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గుంటుముక్కల రఘురామరాజును గురువారం కుతుబుద్దీన్ కలిశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన ఫోన్లో మాట్లాడారు. కడప జిల్లాలో కార్మికుల సంక్షేమం కోసం హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక కుటుంబ సభ్యుల వివాహాలకు భవనం నిర్మించాలన్నారు. వృత్తి శిక్షణ కోర్సుల కోసం కార్మిక భవన్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు చేనేత నాయకులు పూస భాస్కర్, టిఎన్‌టియుసి నాయకులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపట్ల సంతృప్తి

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం ఉన్నత పాఠశాలల, ప్రాథమిక పాఠశాలలను గురువారం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మీనాక్షి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల విద్యా ప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన పిల్లలకు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌లో ఉపాధ్యాయులు శిక్షణ పొందిన అంశాలను పిల్లలకు నేర్పించాల్సిందిగా సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఓబులేసు, రామయ్య పాల్గొన్నారు.

సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం ఎపిఎస్ఎస్‌డిసి, హిందుస్థాన్, కోకోకోలా, వేతరేజెస్ సంస్థలు విద్యార్థులకు సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ వృత్తివిద్యకు సంబంధించి ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఆలోచనలను, ప్రవృత్తులను, నైపుణ్యాలను అలవర్చుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణరాజు, పి వెంకటసుబ్బారెడ్డి, మేనేజర్ సితార్ బాషా పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటంతో భూములు స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దముడియం

పెద్దముడియం మండలంలోని కొండపాపాయి పల్లె గ్రామంలో దళితులైన జంబుగాళ్ల సుబ్బరాయుడు, జంబుగాళ్ల ఓబులేసు, జంబుగాళ్ల నడిపి ఓబులేసు, పలువురు దళితులకు చెందిన 25 ఎకరాల భూమిని 40ఏళ్లుగా స్థానిక అగ్రవర్ణాలకు చెందిన కైఫ్ గోపాల్ రెడ్డి, సోముల జగన్మోహన్ రెడ్డి కాకినాడ సుబ్బరాయుడు, సోముల శేఖర్‌రెడ్డి అక్రమంగా దళిత భూములను అనుభవిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో కోర్టు ఆ భూములపై దళితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 45 ఏళ్ల సుదీర్ఘ భూ పోరాటం ఫలించిందని హర్షం వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - వేముల

మంత్రి సవితకు వినతిపత్రమిస్తున్న పార్థసారథిరెడ్డి

పులివెందుల నియోజక వర్గంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితను విజయవాడలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి కోరారు. ఆ మేరకు మంత్రిని ఆమె నివాసంలో గురువారం ఆయన కలిసి రెవెన్యూ రికార్డుల్లో సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సవిత స్పందిస్తూ ఈ విషయమై తమ దృష్టికి కూడా వచ్చిందని, వెనువెంటనే కలెక్టర్, జెసితో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు పార్థసారధి రెడ్డి తెలిపారు.

మావూళ్లమ్మకు బిటెక్ రవి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని నారపరెడ్డిగారిపల్లె సమీపాన వెలసిన మావూళ్లమ్మ దేవతకు అభిషేకాలు నిర్వహించారు. గురువారం మావూళ్లమ్మ విగ్రమ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి విచ్చేశారు. బండలాగుడు పోటీలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లోమడ భాస్కర్‌రెడ్డి (ఎల్‌బిఆర్) విశ్రాంతి ఉపా ధ్యాయుడు మాధవరెడ్డి, పలువురు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనురాధ లక్ష్మికి నారీశక్తి పురస్కార్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎం అనురాధ లక్ష్మి నారీ శక్తి పురస్కార్-2025 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం ట్రస్ట్, నేస్తం సేవా సమితి సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. 2025 నారీశక్తి పురస్కార్ అవార్డును ఎం.అనురాధ లక్ష్మిని ఎంపిక చేసి, గురువారం ప్రశంసాపత్రం మెమెంటో, శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరభద్ర సేవా సంస్థ చైర్మన్ మాలకొండయ్య, నేస్తం సేవా ఫౌండేషన్ అధ్యక్షులు కొండారెడ్డి, కళాశాల ఉప ప్రధానాచార్యులు సుభాన్ సాహెబ్. రాధారామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, సీనియర్ అధ్యాపకులు సుబ్బరాయుడు, రామేశ్వర్ రెడ్డి, అయ్యవారు రెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, చెన్న రాయుడు, శ్రీనివాసులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కిషోర్, శివ, శ్రీవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు వన్నె తెచ్చేది మహిళలే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సంస్కృతి, సంప్రదాయాలకు వన్నె తెచ్చేది మహిళలేనని డిఎస్‌పి భావన పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కడప జిల్లా పోలీస్ శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ సంయుక్తంగా కలసి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహిళలు, విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలించి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, శూలం లక్ష్మీదేవి, కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణ మాట్లాడారు. కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీ శంకర, పృథ్వీ నారాయణ, దావీద్, మహి, భారతి, జ్యోతి, సలీం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వెంకట ఆంజనేయులు, లక్షుమ్మ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు, అతివేగమే కారణం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చిలమాకూరు గుర్రప్పకు చెందిన ట్రాక్టర్ నాపరాయి గనుల్లో వేస్ట్ రాయి తోలెందుకు రోజు గని వద్దకు వెళుతుంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున బయలుదేరేందుకు ట్రాక్టర్ రోడ్డు పక్కగా ఉన్న మసీదు వద్ద ఆపి, కార్మికులను ఎక్కించుకుంటుండగా ఆకస్మాత్తుగా అతి వేగంగా లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ దుర్ఘటనలో లక్ష్మమ్మ (58) బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాక్టర్ ఎక్కబోతున్న వెంకట ఆంజ నేయులుకు కూడా బలమైన గాయాలుయ్యాయి. స్థానికులు గమనించి గాయ పడిన వారిని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట ఆంజనేయులు (55) మృతి చెందాడు. గాయపడిన మల్లెల రోశయ్య, పాపిగాల్ల ఓబయ్య, పాలుగారి గుర్రప్ప చికిత్స పొందుతున్నారు. సంఘ టనా స్థలాన్ని సిఐ నరేష్ బాబు, పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగమే ప్రమాదానికి కారణం..

చిలమకూరు హైవే రోడ్డుపై వాహనాలు అత్యంత వేగంగా వెళుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. లారీ వేగంగా వెళుతుండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎక్కువ రద్దీగా ఉంటుందని, హైవే కావడం వలన స్పీడ్ బ్రేకర్లు లేవని తెలిపారు. వాహనాల వేగ నియంత్రించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శ..

గాయపడి ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-కడప ప్రధాన రహదారిలోని కొత్తపల్లె గ్రామ పొలంలోని సున్నపురాళ్లపల్లె బస్టాప్ సమీపం వద్ద గురువారం అశోక్ (32) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాలోని బుక్కరాయ సముద్రం మండలం భద్రంపల్లెకు చెందిన బుల్లె అశోక్ బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అశోక్‌కు కర్నూలు జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సునీతతో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య సునీత మూడేళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకొని వెళ్లిపోయింది. అప్పటి నుండి మృతుడు మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల కిందట భార్య దగ్గరికి వెళ్లొస్తానని చెప్పాడు. 3 రోజుల తర్వాత తిరిగి ఇంటికి వచ్చాడు. బుధవారం తన భార్య వద్దకి పోయి వస్తానని చెప్పి స్వగ్రామం నుండి బయలదేరి వచ్చాడు. మృతుడి తండ్రి నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్యపై భర్త గొడ్డలితో దాడి

- మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలింపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో గురువారం ఎర్రిబోయిన కళావతిని ఆమె భర్త భాస్కర్ గొడ్డలితో తలను నరికిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. భార్యభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఘర్షణ చోటు చేసుకుంది. ఇంటిలో ఎవరులేని సమయంలో భాస్కర్ తన భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. కళావతికి బలమైన గాయం తగలడంతో బంధువులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించాలని వైద్యులు సూచించారు. ట్రైనీ డిఎస్‌పి భవాని, ఎస్ఐ చిన్న పెద్దయ్య సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.